

# జేబుదొంగ

## మల్లాది వెంకటకృష్ణమూర్తి

మేజిస్ట్రేట్ చౌదరికి ఆ రోజుతో సరిగ్గా పదేళ్ళ సర్వీస్ నిండుతోంది. ఆ పదేళ్ళలో ఎన్నో క్రిమినల్ కేసుల్లో తీర్పు చెప్పాడు. ఎందర్నో శిక్షించాడు. ఎందర్నో నిరపరాధులుగా విడుదల చేసాడు. కోర్టుకి వస్తూ కారులో కొన్ని కేసులని నెమరు వేసుకోసాగాడు.

ఆ రోజు మొదటి కేసు ఓ దొంగతనంది. తన కుటుంబ సభ్యులతో శని, ఆదివారాలు పొరుగూరు వెడుతూ ఓ ఇంటావిడ పాలవాడి కోసం ఓ చీటీ రాసి అతనికి కనిపించేలా పెట్టి వెళ్లింది. అందులో 'శని, ఆదివారాలు పాలపేకెట్లు వుంచకు' అని రాసింది. సోమవారం వూరు నించి తిరిగి రాగానే ఇంటికి తాళం లేదు. ఇల్లంతా ఖాళీగా వుంది. ఆ ఇంట్లో ఓ చీటీ కనిపించింది. అందులో 'మీరు కోరినట్లు పాల పేకెట్లు, మేం కోరుకున్నట్లు ఇతరములు వుంచడం లేదు' అని రాసి వుంది. ఆమె లబోదిబోమంటూ పోలీస్ రిపోర్ట్ ఇచ్చింది. పోలీసులు ఆ దొంగని పట్టుకున్నారు. కోర్టులో గత వాయిదాలో ఆ దొంగ చేతిరాత, ఆ చీటీలోని చేతిరాత ఒకటేనని రుజువయింది.

ఆ రోజు తీర్పు చెప్పాలి. తీర్పు ఇంటి దగ్గరే రాసుకున్నాడు చౌదరి. తీర్పు చెప్పాడు ఆ దొంగకి ఆర్నెల్లు ఖైదు విధిస్తూ.

పట్టుబడ్డ వేశ్యలు, తాగి గొడవ చేసినవాళ్ళు, రోడ్డు మీద కొట్టుకున్న వాళ్ళు, టీ తాగి డబ్బులడిగారని ఇరానీ రెస్టారెంట్ కేషియర్‌ని కత్తితో పొడిచిన వాళ్ళు, పేకాట ఆడుతూ పట్టుబడ్డ వాళ్ళు, మట్కా నడిపేవారు... అనేక రకాల నేరస్థులని పోలీసులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రవేశపెడుతున్నారు. చౌదరి కొందరికి ఫైన్స్, కొందరికి శిక్షలు, కొందరికి ఆ రెండూ విధిస్తున్నాడు. కొందర్ని నిరపరాధులుగా భావించి విడుదల చేస్తున్నాడు, సాక్ష్యం చాలదని. ఇంకొందరి కేసులు వాయిదా వేస్తున్నాడు.

మధ్యాహ్నం లంచ్ తర్వాత వచ్చిందా కేసు.

నిందితుడి వయసు పధ్నాలుగేళ్ళు కూడా వుండవు. సంస్కారంగలకుటుంబం నించి వచ్చినవాడని అతని మొహం చూస్తే తెలిసిపోతోంది. తరచు బోనులో నేరస్థుడిగా నిలబడే వ్యక్తి కాదు. అసలు ఆ తరహాకి చెందిన వాడే కాదు.

''ఏమిటి ఇతని నేరం?'' అడిగాడు చౌదరి అతన్ని ఎగాదిగా చూసి.

''జేబు దొంగతనం'' చెప్పాడు పి.పి. తర్వాత తన చేతిలోని కాగితాలని చూసి చెప్పాడు అతను.

''మొన్న రాత్రి ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్‌లో ఓ వ్యక్తి జేబులోని పర్స్ కొట్టేసాడు. పోలీసులు వెంటనే అరెస్ట్ చేసారు''

ఆ పర్స్, అందులోని డబ్బుని ఎగ్జిబిట్స్‌గా ప్రదర్శించారు. పర్స్ పోయినతను అది తనదేనని, ఆ కుర్రాడే తన జేబులోంచి పర్స్ కొట్టేసాడని సాక్ష్యం చెప్పాడు.

''నువ్వేమంటావ్?'' అడిగాడు చౌదరి ఆ కుర్రాడిని.

''పోలీసులు పొరబడ్డారు. ఆ పర్స్ నేను కొట్టేయలేదు''.

''మరి అది నీ జేబులో ఎలా దొరికింది వాళ్ళకి?'' ప్రశ్నించాడు చౌదరి.

''నాకు తెలీదది. దాన్ని కొట్టేసిన జేబుదొంగ నాకు తెలీకుండా దాన్ని నా జేబులో వుంచి వుంటాడు- పోలీసులు అందరి జేబులూ వెదుకుతున్నారన్న భయంతో''.

''అతను నీ జేబులో పర్స్ వేస్తుంటే నీకు తెలీలేదా?''

''ఊహు... నావి లూజు జేబులు. కావాలంటే చూడండి'' ఆ కుర్రాడు తన ప్యాంట్ జేబులు బయటికి తీసి చూపించాడు.

''గతంలో నీవు ఇలాంటి నేరం చేస్తూ ఎప్పుడైనా పట్టుబడ్డావా?'' అడిగాడు చౌదరి.

''లేదు''

అతని తండ్రి ఎల్.ఐ.సి.లో పెద్ద వుద్యోగంలో వున్నాడు. నిజానికి ఆ కుర్రాడికి జేబుదొంగతనం చేయాల్సినంత డబ్బు అవసరం వుండదు. బలమయిన సాక్ష్యం లేని కారణంగా చౌదరి ఆ కుర్రాడిని విడుదల చేయవలసిందిగా పోలీసులని ఆదేశించాడు. అది విన్న ఆ కుర్రాడి మొహంలో ఎంతో రిలీఫ్- 'థాంక్‌యూ సర్' చెప్పాడు.

మర్నాడు సాయంత్రం చౌదరి తన కుటుంబ సభ్యులతో సినిమాకి వెళ్లాడు. క్యూలో కౌంటర్ దగ్గరకి వెళ్లాక జేబు చూసుకుంటే పర్స్ లేదు. ఎవరో కొట్టేశారు. ఉన్నవి పాతికే. పోలీస్ రిపోర్టు ఇస్తే మర్నాడు వుదయం పేపర్లో 'మేజిస్ట్రేట్ జేబులోని పర్స్ దొంగతనం' అని వ్రాస్తారని తిరిగి ఇంటికి వెళ్లిపోయాడు.

మర్నాడు లంచ్ అవర్‌లో చౌదరి తన ఛాంబర్‌లో భోజనం చేస్తూండగా వచ్చాడా కుర్రాడు. గత రోజు నిరపరాధిగా తను విడుదల చేసిన ఆ కుర్రాడు ఓ పర్స్ టేబిల్ మీద వుంచి చెప్పాడు-

''వెరీ సారీ. ఆ పర్స్ మీదని పర్స్‌లోని మీ ఫోటో చూసేదాకా తెలీదు''

గిరుక్కున వెనక్కి తిరిగి క్షణాల్లో మాయం అయ్యాడా కుర్రాడు. తన పర్స్ అతనికెలా లభించిందో స్ఫురించాక దాన్ని అందుకుని తెరిచిమాస్తే డబ్బు చెక్కు చెదరకుండా వుండడం గమనించాడు మేజిస్ట్రేట్ చౌదరి.



18-5-90 ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక